మరీ ఇంత నిర్లక్ష్యమా?

- మూలకు చేరిన రూ. కోటి విలువైన ఎక్స్‌లేటర్ మిషన్
- గెడ్డలో పేరుకుపోతున్న ఏడు గ్రామల వ్యర్థాలు
- దుర్గంధం.. వ్యాధులతో స్థానికుల ఇక్కట్లు

కోటి రూపాయల ప్రజాధనంతో సమకూర్చిన వ్యర్థాలు తొలగించే యంత్రం నిరుపయోగంగా మారింది. దీనిని ఏడాది నుండి వినియోగించకపోవటంతో ప్రస్తుతం ఇది పని చేస్తుందో, లేదో తెలియని పరిస్థితి. ప్రజాధనంతో కొన్న యంత్ర పరికరాన్ని ఇంత నిర్లక్ష్యంగా అధికారులు విడిచిపెట్టడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సొంత ఖర్చుతో కొన్న వస్తువైతే ఇలా **నిర్లక్ష్యంగా వదిలేస్తారా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.**



కోటి రూపాయలతో కొనుగోలు చేసిన ఎక్స్‌లేటర్ మిషన్



మిషన్ చుట్టు పేరుకుపోయిన వ్యర్థాలు

మల్కాపురం: మల్కాపురం మరిడిమాంబ కల్యాణ మండపం ఎదురుగా గెడ్డ ఉంది. ఈ గెడ్డలోకి ఎగువ ప్రాంతాలైన జనతా కాలనీ, ప్రకాష్‌నగర్, అచ్చినాయుడుతోట, ప్రియదర్శిని కాలనీ, గాంధీజీ వీధి వంటి ప్రాంతాల నుండి కాలువలు, గెడ్డల ద్వారా వచ్చే వ్యర్థాలు, మురుగు చేరుతుంటాయి. దీనికి ఆనుకుని ఉన్న హెచ్‌పీసీఎల్ రక్షణ గోడ దిగువ గల మార్గం ద్వారా సముద్రంలో వ్యర్థ జలం కలిస్తే, వ్యర్థాలను వ్యాన్ల ద్వారా కాపులుప్పాడలో గల డంపింగ్ యార్డ్‌కు ఎప్పటికప్పుడు తరలించేవారు. అయితే వర్షాలు అధికంగా వచ్చినప్పుడు లేదా వ్యర్థాలు తరలించే వాన్లు రానప్పుడు గెడ్డలో భారీగా వ్యర్థాలు చేరిపోతుంటాయి. దాంతో దుర్వాసన వ్యాపిస్తు, క్రిములు చేరి స్థానికులు ఇబ్బందులకు గురవుతుంటారు. అలాగే భారీ వర్షాల సమయంలో గెడ పొంగి దగ్గరలోని ఇళ్లలోకి మురుగు నీరు, వ్యర్థాలు చేరిపోతుంటాయి. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకుని అధికారులు కొంత కాలం క్రితం రూ. కోటి వ్యయంతో ఎక్స్‌లేటర్ మిషన్ ఇక్కడ ఏర్పాటు చేశారు. దానిని నిర్వహించేందుకు రూ. 10 వేల జీతంతో ఒక ఆపరేటర్, రూ. 4 వేల జీతంతో ఒక వాచ్‌మేన్‌ను నియమించారు. ఆపరేటర్ రోజు రెండు పూటల గెడ్డలో వ్యర్థాలు తొలగించేలా ఓ కాంట్రాక్టర్‌కు అధికారులు బాధ్యతలు అప్పగించారు. అలా ఏడాది గడిచింది. దాంతో కాంట్రాక్టర్ గడువు ముగిసి అతను ఈ పనుల నిర్వహణను ఆపేసాడు.

సమస్య మళ్లీ మొదటికి..

దీంతో గెడ్డలో మురుగు సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో గెడ్డలో వ్యర్థాలను తొలగిస్తూ వస్తున్నారు. సరిపడా సిబ్బంది రాని సమయంలో వ్యర్థాలు అలాగే ఉండిపోతున్నాయి. వ్యర్థాలను తొలగించే యంత్రం ఉండగా ఎందుకీ కష్టాలు అని పలువురు వాపోతున్నారు. ఏడాదిగా ఎక్స్‌లేటర్ మిషన్‌ను ఉపయోగించకపోవడం, గతంలో నియమించిన వాచ్‌మేన్ ఇప్పుడు లేకపోవడంతో మిషన్ పరికరాలు అదృశ్యం అయ్యే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎక్స్‌లేటర్ మిషన్‌ను వినియోగంలోకి తీసుకు రావాలని కోరుతున్నారు.

ఇంత నిర్లక్ష్యమైతే ఎలా?



కోటి రూపాయలతో కొనుగోలు చేసిన యంత్రం ఏడాది నుండి నిరుపయోగంగా పడి ఉంది. దీనిని సంరక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. మిషన్‌కు ఏమైనా అయితే మళ్లీ ప్రజాధనమే ఉపయోగిస్తారు. ఇప్పటికైనా అశ్రద్ధ విడనాడి గెడ్డలో నిత్యం పూడిక తీసేందుకు ఆ యంత్రాన్ని వాడాలి. అప్పుడే ప్రజాధనం సద్వినియోగం అవుతుంది.

– శీర చిన్నాజీ యాదవ్, మల్కాపురం

అధికారులు స్పందించాలి..



ఎక్స్‌లేటర్ మిషన్ నిరుపయోగంగా మారటం, అక్కడ వాచ్‌మేన్ లేకపోవటం వల్ల విలువైన మిషన్ పరకరాలు అదృశ్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రజాధనంతో కొన్న యంత్రాన్ని ఇలా నిరుపయోగంగా వదిలేయడం అధికారులు, పాలకులకు తగదు. ఇప్పటికైనా ఆ యంత్రాన్ని వినియోగంలోకి తీసుకొచ్చి గెడ్డను పరిశుభ్రం చేయాలి.

– బాలు, మల్కాపురం

సర్వీసు రోడ్డుకు మోక్షం ఎప్పుడో?

- హామీ నెరవేర్చని పోర్టు అధికారులు
- వాహనచోదకులకు తప్పని అవస్థలు



ములగాడ నుంచి వెళ్లే మార్గంలో గోతులు



శ్రావణ్ షిప్పింగ్ కంపెనీ నుంచి మారుతి సర్కిల్‌కు వెళ్లే మార్గంలో గుంతలు

మల్కాపురం: డాక్‌యార్డ్ వంతెన మార్గం మూసివేయడంతో పారిశ్రామికవాసులు, కార్మికులు నగరానికి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్వీస్ రోడ్డుకు నెల రోజుల్లో మరమ్మతులు చేయిస్తామన్న పోర్టు అధికారులు, ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో వాహనచోదకులకు అవస్థలు తప్పడం లేదు.

జీవీఎంసీ 58వ వార్డు శివారు ప్రాంతమైన ములగాడ విలేజ్ మీదుగా శ్రావణ్ షిప్పింగ్ సంస్థను దాటుకుని, మారుతి సర్కిల్ మీదుగా నగరానికి చేరుకుంటున్నారు. అయితే, ములగాడ నుంచి శ్రావణ్ షిప్పింగ్‌కు వెళ్లే మార్గం గుంతలమయమై, ధూళితో నిండి ఉంది. దీంతో నగరానికి వెళ్లాలనుకునే వాహనదారులతో పాటు, పరిశ్రమల్లో విధులకు హాజరయ్యే కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ములగాడవాసులు గత నెల ఆందోళన బాట పట్టడంతో స్పందించిన పోర్టు అధికారులు గత నెలలో ఇక్కడికి వచ్చి, నెల రోజుల వ్యవధిలో రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. వారు మాట ఇచ్చి నెల రోజులు గడుస్తున్నా సర్వీసు రోడ్డుకు మోక్షం లభించకపోవడంతో గ్రామస్తుల మరలా ఆందోళన బాట పట్టేందుకు సిద్ధపడుతున్నారు.

సెయింట్ జోసెఫ్‌లో ఎక్సెల్సియార్ వేడుకలు



వేడుకలను ప్రారంభిస్తున్న అతిథులు, కళాశాల సిబ్బంది

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ నేతృత్వంలో ఎక్సెల్సియార్ యువజనోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా కళాశాల పూర్వ విద్యార్థిని, గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైకాలజీ ప్రొఫెసర్ నళిని బిక్కిన పాల్గొన్నారు. ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ఏ దేశంలో అయినా, ఏ రంగంలో అయినా ముందుంటారని తెలిపారు. దానికి ఆత్మవిశ్వాసం, స్వయం నిర్ణాయక శక్తి అవసరమని పేర్కొన్నారు. వేడుకల్లో విద్యార్థినులు నృత్య, సంగీత, చిత్రలేఖన, ఫొటోగ్రఫీ, ముకాభినయ, నాటక, ఏకపాత్రాభియ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు. విజేతలకు ముగింపు వేడుకల్లో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుధ, ప్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ పి.కె.జయలక్ష్మి ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ టి.భాస్కర సుధ, సిస్టర్ మేరీ, నాన్సీ, డాక్టర్ మాణిక్యకుమారి, హరిణి, సోనీ, పవన్, డాక్టర్ లక్ష్మీ ప్రభ, ప్రమీల, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పశుగణన ప్రారంభం



పశుగణన నిర్వహిస్తున్న సిబ్బంది



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో శుక్రవారం గాంధీగ్రామం ప్రభుత్వ పశువైద్యశాల వైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పశుగణన కార్యక్రమం ప్రారంభించారు. డాక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ అఖిల భారత పశుగణన కార్యక్రమం ఆస్పత్రి పరిధిలో ఉన్న 28 వార్డుల్లో వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు నిర్వహిస్తామని తెలిపారు. దీనివలన పశువుల సంఖ్య, రకాలు, ఉత్పత్తి మొదలగు విషయాలను క్షుణ్ణంగా తెలుసుకోవచ్చన్నారు. తద్వారా పశుపరిశ్రమకు, రైతులకు అనువుగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించి అమలు చేసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పశువైద్యశాల సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

విశాఖ విద్య: పశు గణన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గణబాబు శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించి ప్రారంభించారు. గోపాలపట్నం ప్రాంతీయ పశు వైద్యశాల పరిధిలో శుక్రవారం నుంచి 2024 ఫిబ్రవరి 28 వరకు పశు గణన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి వైద్యులు రవికుమార్ తెలిపారు. నియోజకవర్గంలో పాడి, పశు సంపదను పెంచేవారంతా దీనిలో భాగస్వామ్యులైన పశు వైద్యులు, సిబ్బందికి సహకరించాలని ఎమ్మెల్యే గణబాబు సూచించారు. భవిష్యత్ అవసరాలకు పశు గణన ఎంతో దోహదపడుతుందన్నారు.

క్లుప్తంగా

మద్యానికి డబ్బులివ్వలేదని వ్యక్తిపై దాడి

మల్కాపురం: మద్యం సేవించడానికి డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో ఓ వ్యక్తిని ఓ యువకుడు గాయపరిచాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. నక్కవానిపాలెం ప్రాంతానికి చెందిన బుల్లేబల్లి శ్రీకాంత్ అనే యువకుడు శుక్రవారం ఉదయం 60వ వార్డు పరిధి గుల్లలపాలెం వద్ద గల వాకింగ్ పార్కు వద్దకు మద్యం సేవించి వచ్చాడు. అదే సమయంలో మల్కాపురం ప్రాంతానికి చెందిన ఎస్.రాము (50) అక్కడికి వచ్చారు. శ్రీకాంత్ ఆయన్ను అడ్డగించి, మద్యానికి డబ్బులు కావాలని డిమాండ్ చేశాడు. తన వద్ద లేవని రాము చెప్పడంతో కోపానికి గురైన శ్రీకాంత్ అక్కడున్న ఓ రాయితో రాముపై దాడి చేసి గాయపరిచి, అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో బాధితుడు మల్కాపురం పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు తీసుకున్న పోలీసులు ఆయన్ను ఆస్పత్రికి తరలించి, వైద్యం అందించారు. గాయపరిచిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

62వ వార్డులో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డులో ఇటీవల వాహనదారులు వేగంగా ప్రయాణించడంతో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో వాహనదారుల వేగానికి కళ్లెం వేసేందుకు వార్డులోని రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నారు. జీవీఎంసీ సహకారంతో వీటిని నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

‘పీఆర్‌టీయూ ప్రతిపాదన సరికాదు’

విశాఖ విద్య: ఉపాధ్యాయుల బదిలీల్లో దివ్యాంగుల ప్రాధాన్యతను తగ్గించేలా పీఆర్‌టీయూ చేసిన ప్రతిపాదనలను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు వికలాంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పీహెచ్ వారికి పర్సంటేజీని బట్టి వెసులుబాటు ఇవ్వాలనే వారి ప్రతిపాదన ఎంతమాత్రం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇది వికలాంగ చట్టం స్ఫూర్తికి విరుద్ధమైన ప్రకటన అని గుర్తు చేశారు. పాఠశాల విద్యా డైరెక్టర్ విధానపరమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు వికలాంగ సంఘాల వారి అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వికలాంగ ఉపాధ్యాయ, ఉద్యోగులను కించపరిచేలా పీఆర్‌టీయూ చేసిన ప్రతిపాదనలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం, క్రైమ్ ఇన్వెస్టిగేషన్ విభాగం (సీఐడీ) సంయుక్త ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ అండ్ సేఫ్టీ అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు జరగకుండా డిజిటల్ టెక్నాలజీని సరైన రీతిలో సద్వినియోగం చేసుకోవాలంటే సైబర్ క్రైమ్‌పై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. సీఐడీ రీజనల్ ఆఫీసర్ డాక్టర్ ప్రేమ్ కాజల్, ఐవోపీ వి. గోపీనాథ్, ఎస్సై పి. చంద్రశేఖర్, బీవీజీ ప్రసాద్, జీవీ రమణ, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డి. అరుణపద్మ, డాక్టర్ కె. శిరీష, డాక్టర్ ఆర్, కిరణ్మయి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా స్టాల్స్ ఏర్పాటుకు అంగీకరించని వాకర్లు



జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వద్ద ఉన్న వాకర్స్ పార్క్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వాకింగ్ పార్కు వద్ద బాణసంచా స్టాల్స్ ఏర్పాటుకు వాకర్స్ క్లబ్ కమిటీ ప్రతినిధులు అడ్డు తగిలారు. దీంతో స్టాల్స్ ఎక్కడ ఏర్పాటు చేసుకోవాలో నిర్వాహికులకు అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. వాకింగ్ పార్కు ఆవరణలో గల మైదాన ప్రదేశంలో, వాకర్స్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా, అధికారులు సూచించే అనుమతులతో గత కొన్నేళ్ల నుండి వ్యాపారులు స్టాళ్లను ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తుండే వారు. అయితే స్టాల్స్ ఏర్పాటు చేస్తే ఇబ్బందిగా ఉంటుందని వాకర్లు తదితరులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వాకింగ్ ట్రాక్ ఆవరణలో గల మైదాన ప్రదేశంలో పలువురు క్రీడకారులు షటిల్, బాక్సింగ్, కరాటే ప్రాక్టీస్ చేస్తుంటారని స్టాల్స్ ఏర్పాటు చేసే వారికి ఇబ్బంది అని కమిటీ ప్రతినిధులు అధికారులకు వినతి రూపంలో వివరించారు. దీంతో అధికారులు వాకర్స్ పార్కు వద్ద స్టాల్స్ ఏర్పాటు చెయ్యొద్దని అని ఆదేశాలు జారీ చేశారు. అధిక మొత్తంలో సామగ్రి కొనుగోలు చేశామని ఇప్పుడు స్టాల్స్ ఏర్పాటుకు అడ్డు తగిలితే తమ వ్యాపారాలు ఎక్కడ నిర్వహించుకోవాలని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ వలన ఎలాంటి ఇబ్బంది ఉండదని, తమ వ్యాపారం కేవలం రెండు రోజుల మాత్రమే ఉంటుందని తెలిపారు. తమ పరిస్థితిని అర్థం చేసుకుని అనుమతులు ఇవ్వాలని వ్యాపారులు అధికారుల వద్ద మొర పెట్టుకున్నారు. అయితే నక్కవానిపాలెం వద్ద గల ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని అధికారులు వ్యాపారులకు భరోసా ఇవ్వటంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. ఈ నెల 29, 30, 31వ తేదీల్లో అధికారులు సూచించిన స్థలంలో వ్యాపారులు బాణసంచా విక్రయించే అవకాశం ఉంది.

‘ఎంత పని చేశావ్ చంటి’ చిత్ర యూనిట్ సందడి



సందడి చేస్తున్న చిత్ర యూనిట్ సభ్యులు

దాబాగార్డెన్స్: పీజేకే మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై శ్రీనివాస్ ఉలిశెట్టి హీరోగా, శాంతిప్రియ హీరోయిన్‌గా ఉదయ్‌కుమార్ దర్శకత్వంలో లడ్డే బ్రదర్స్ నిర్మించిన చిత్రం ఎంత పని చేశావ్ చంటి. ఆ చిత్ర యూనిట్ శుక్రవారం వెంకటేశ్వర థియేటర్ వద్ద సందడి చేసింది. సినిమా విడుదల సందర్భంగా హీరో శ్రీనివాస్, దర్శకుడు ఉదయ్‌కుమార్, హీరోయిన్లు నిహారిక, శాంతి ప్రియ, ఇతర నటీనటులు ప్రేక్షకులతో కలిసి సినిమా వీక్షించారు. హీరో శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ తొలి రోజే ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. దియా రాజ్, నిహారిక కేశవ్, శాంతిప్రియ, పాల్గొన్నారు.

కాలనీలో పూల గుబాళింపు



రహదారి మధ్యలో చూడముచ్చటగా కనిపిస్తున్న పూల మొక్కలు



మర్రిపాలెం వుడా లే అవుట్ పార్కులో పచ్చదనం మధ్యలో కూర్చొనేందుకు ఏర్పాట్లు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు పరిధి సంజీవ్‌నగర్ ప్రధాన రహదారిలో పూలు గుబాళిస్తున్నాయి. హైవే నుంచి సంజీవ్ నగర్ మీదుగా పీఎఫ్ ఆఫీస్ ముందు నుంచి మర్రిపాలెం వుడా లే అవుట్ కమ్యూనిటీ హాల్ వరకు రహదారి మధ్య డివైడర్లను ఏర్పాటు చేసి, వాటిలో పూలమొక్కలు పెంచుతున్నారు. రక్షణగా గ్రిల్స్ కూడా ఏర్పాటు చేయడంతో చూడముచ్చటగా కనిపిస్తున్నాయి. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చేపట్టిన ఈ పనులతో కాలనీలోని రహదారులపై పచ్చని అందాలు కనువిందు చేస్తున్నాయి. జిందాల్ భవనం పక్క నుంచి సుమారు మూడు కిలోమీటర్ల మేర రహదారి మధ్యలో వివిధ రకాల పూల మొక్కలు నాటి, సంరక్షణ చర్యలు చేపట్టారు. జీవీఎంసీ సిబ్బంది రోజూ ఈ పూల మొక్కలకు నీళ్లు పోస్తుండటంతో ఏపుగా పెరుగుతున్నాయి. మర్రిపాలెం వుడా లే అవుట్ అసోసియేషన్ కూడా సామాజిక బాధ్యతగా కాలనీలో పార్కుల సంరక్షణ బాధ్యత తీసుకుంది. దీంతో కాలనీలోని పార్కులు పచ్చదనంతో కళ కళలాడుతున్నాయి.

మేధో చర్చలకు వేదికగా సదస్సులు



సదస్సులో పాల్గొన్న ఏయూ వీసీ ఆచార్య శశిభూషణ్‌రావు తదితరులు

మద్దిలపాలెం: మేధో చర్చలకు వేదికలుగా సదస్సులు నిలవాలని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఏయూ జియో ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ‘జియో స్పేషియల్ టెక్నాలజీస్ ఆన్ రిజర్వాయిర్స్ అండ్ ఎన్విరాన్మెంటల్ చాలెంజెస్’ జాతీయ సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వర్తమాన ప్రాధాన్యం కలిగిన అంశం మీద సదస్సు నిర్వహించడంపై నిర్వాహకులను అభినందించారు. శతాబ్దానికి చేరువవుతున్న ఏయూలో విద్యనభ్యసించడం ఎంతో గర్వకారణమన్నారు. విద్యార్థులు తమ సంపూర్ణ సమయాన్ని నూతన జ్ఞానాన్ని పొందడానికి వెచ్చించాలని సూచించారు. విద్యతోపాటు క్రమశిక్షణ ఎంతో అవసరమని, ఇది విద్యార్థి భావిజీవితానికి పునాదిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ వాటర్ రిసోర్సెస్ డిపార్ట్‌మెంట్ విశ్రాంత చీఫ్ ఇంజినీర్ వి.శ్రీధర్, ఇండియన్ సొసైటీ ఆఫ్ జియోమేటిక్స్ విశాఖ ప్రాంతీయ కేంద్రం చైర్మన్ ఆచార్య కె.నాగేశ్వరరావులు ప్రసంగించారు. సదస్సు ప్రాముఖ్యత, రెండు రోజుల సదస్సులో చర్చించే అంశాలను విభాగాధిపతి, సదస్సు కన్వీనర్ ఆచార్య పి.జగదీశ్వరరావు వివరించారు. సదస్సు కన్వీనర్ ఆచార్య సి.వి.వి సత్యనారాయణ పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి



విద్యార్థులతో దువ్వాడ జీఆర్‌పీ ఎస్‌ఐ లక్ష్మి, హెచ్‌ఎం ప్రకాశరావు

అగనంపూడి: శాంతిభద్రతల పరిరక్షణ, సంఘ విద్రోహుల నుంచి ప్రజలకు రక్షణ కల్పించే క్రమంలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరులు త్యాగాలను మననం చేసుకోవడం సముచితమని దువ్వాడ జీఆర్‌పీ ఔట్‌పోస్ట్ ఎస్‌ఐ కె.టి.ఆర్.లక్ష్మి అన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా దువ్వాడ జీఆర్‌పీ ఔట్‌పోస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల మాన ప్రాణాలు కాపాడడంలో ఎందరో పోలీసులు ప్రాణాలను పణంగా పెట్టారన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సూర్య ప్రకాశరావు, హెడ్ కానిస్టేబుల్ డి.రాజు, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు ఎం.మన్నాజీ, నారాయణరావు పాల్గొన్నారు.

నిరాశ్రయుల సంక్షేమమే ధ్యేయం



వసతిగృహాన్ని పరిశీలిస్తున్న యూసీడీ పీడీ సత్యవేణి

సీతమ్మధార: నిరాశ్రయుల సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలని జీవీఎంసీ అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్(యూసీడీ) విభాగం ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణి కోరారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ద్వారకానగర్ టీఎస్ఆర్ కాంప్లెక్సులో గల జీవీఎంసీ–ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహాన్ని సందర్శించారు. రోడ్లపై తిరిగే నిరాశ్రయులు, అనాథలను రెస్క్యూ ద్వారా వసతిగృహాలకు తరలించాలని సూచించారు. మానసిక రోగులకు అందిస్తున్న చికిత్స గురించి శ్రద్ధా ఫౌండేషన్ బృందంతో చర్చించారు. అలాగే ఇక్కడి నిరాశ్రయులైన పురుషులు, మహిళల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. కాగా వసతి గృహంలో మంచినీటి సమస్య ఉందని సిబ్బంది ఆమె దృష్టికి తీసుకురాగా, మంచినీటి సరఫరా విభాగం ఇంజినీర్ల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని అన్నారు. అనంతరం ఆమె వసతిగృహం రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏయూటీడీ సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు, మేనేజర్ జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.